క్లుప్తంగా

పింఛన్‌దారులకు దుప్పట్లు పంపిణీ



పిట్టలవానిపాలెం: కోన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పింఛన్ దారులకు బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి తనయుడు వైఎస్సార్ సీపీ నాయకులు కోన నిఖిల్ శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సచివాలయ పరిధిలోని 256 మందికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలాశ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచి యేట్ర అశ్వినిరెడ్డి, కోమలి సర్పంచి ఎస్.నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, కె.దేవేంద్రరాజు, డి.మాధవరావు, బి.సుబ్బారావు, ఎ.సురేష్‌బాబు, చందోలు బండ్లమ్మ దేవాలయ ధర్మకర్తలి మండలి చైర్మన్ ఎ.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


నేడు సెంట్రల్ లైటింగ్, అంబేడ్కర్ పార్కు ప్రారంభం

రేపల్లె రూరల్: పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ ప్రారంభం, అంబేడ్కర్ పార్కు శనివారం పునఃప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్, బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తులు

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణ, మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ మాణిక్యం శుక్రవారం తెలిపారు. పట్టణంలోని 14వ వార్డు వడ్డెర కాలనీ, 7వ వార్డులలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఓసీ అభ్యర్థులు, తుమ్మల పంచాయతీ హరిజనవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎస్సీ అభ్యర్థినిలు కార్యకర్త పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేపల్లె మండలం నల్లూరిపాలెం, నల్లూరునార్త్‌లో ఓసీ అభ్యర్థిలు, పేటేరు ఎస్సీ కాలనీ, నగరం మండలం ఏలేటిపాలెం-2, పెద్దపల్లి-2 అంగన్‌వాడీ కేంద్రాలలో ఎస్సీ అభ్యర్థులు ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తకు 10వ తరగతి, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే మహిళ ఆ గ్రామపరిధిలో నివాసం కలిగి ఉండాలని చెప్పారు. 2023 డిసెంబర్ 31వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు చేసుకునేవారు ఈ నెల 20 నుంచి 27వ తేదీలోగా స్థానిక కార్యాలయంలో దరఖాస్తు అందించాలన్నారు.

నెహ్రూ యువ కేంద్రం జిల్లా కమిటీ సభ్యుడిగా జగన్నాథశాస్త్రి



చెరుకుపల్లి: నెహ్రూ యువ కేంద్రం బాపట్ల జిల్లా కమిటీ సభ్యుడిగా చెరుకుపల్లికి చెందిన రాంపల్లి జగన్నాథశాస్త్రి శుక్రవారం నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బాధ్యతలను సమర్థంగా నిర్వహించి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని చెప్పారు.

శ్రీ రాముని అక్షింతల పంపిణీ

భట్టిప్రోలు: శ్రీరాముని అక్షింతలు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీగా ఆలూరి

రేపల్లె రూరల్: కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా జనరల్ సెక్రటరీగా ఆలూరి నారాయణను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు నియామకపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన రాజ్యసభ మాజీ సభ్యుడు జేడీ శీలం, అంజిబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన

ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: అంబేడ్కర్ ఆశయాలకు అద్దం పట్టేలా రాష్ట్రంలో సుభిక్షమైన పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. సామాజిక సమతా సంకల్ప వేడుకల్లో భాగంగా పట్టణంలో ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. అనంతరం విజయవాడ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలివెళ్లారు. ఎమ్మెల్యే కోన నివాసం నుంచి పురవీధుల్లో కొనసాగిన ప్రదర్శన స్థానిక అంబేడ్కర్ విగ్రహం, మార్కెట్‌యార్డు వరకు కొనసాగింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ డాక్టరు బి.ఆర్.అంబేడ్కర్ పొందుపరిచిన రాజ్యాంగం ప్రపంచ దేశాలు భారత్‌వైపు చూసేవిధంగా చేశాయని చెప్పారు. స్వాతంత్ర్య ఫలాలు నేరుగా అందరికి అందుతున్నాయంటే కేవలం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అందించిన రాజ్యాంగం వలనే సాధ్యమైందని చెప్పారు. డాక్టరు బి.ఆర్.అంబేడ్కర్ ఖ్యాతి చరిత్రలో నిలిచిపోయేలా విజయవాడ పట్టణంలో 206 అడుగుల భారీ విగ్రహం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరం రుణపడి ఉంటామని పేర్కొన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రతి విషయాన్ని పాలనలో పెట్టి చూపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే అన్ని రాష్ట్రాల నాయకులు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అభివృద్ధి ఒకవైపు... సంక్షేమం మరోవైపు రాష్ట్ర ప్రజలకు అందించటంలో దేశంలోనే నెంబరు వన్ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉందని కోన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, నాయకులు వి.డేవిడ్, సీహెచ్ హరిబాబు, జి.కృష్ణమూర్తి, సీహెచ్ రాజశేఖర్, ఇ.మాల్యాద్రి, షేక్ సయ్యద్ పీర్, గేరా మణిభూషన్, కె.యోహోషువా, మరియదాసు, శేఖర్, జోగి రాజా, అడే చందు, నన్నం వెంకటేశ్వర్లు, రంగారావు, కె.లక్ష్మీనారాయణ, ఎస్.వీరారెడ్డి, ఎస్.వెంకట్రావు పాల్గొన్నారు.



బాపట్లలో బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే కోన రఘుపతి



చెరుకుపల్లిలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

అంబేడ్కర్ ఆశయ సాధన జగనన్నతోనే సాధ్యం : రేపల్లె సమన్వయకర్త గణేష్

చెరుకుపల్లి: సమాజంలో బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాధికారం అందించాలన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ పేర్కొన్నారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు నియోజకవర్గం నుంచి బయలుదేరిన వాహనాల ర్యాలీని శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ కలలను సాకారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను పేదలకు అందించినట్లు చెప్పారు. విజయవాడలో 206 అడుగుల ఎత్తులో విగ్రహాన్ని నిర్మించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదగా ప్రారంభించుకోవటం హర్షణీయమని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల కోసం పాటుపడుతున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

కర్లపాలెం మండలం నుంచి..

కర్లపాలెం: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని ఎంపీపీ యారం వనజ, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా కార్యదర్శి ఎం. పరమానందకుమార్ పేర్కొన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసిన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ నాయకులు కర్లపాలెం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్‌లపై ర్యాలీగా బాపట్ల మీదుగా విజయవాడ తరలి వెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, పార్టీ నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, పీవీ సురేష్, కూచిపూడి శామ్యూల్ జాన్, యారం ఇసాక్, మనోహర్, రాజేష్, బాబూరావు పాల్గొన్నారు.



అద్దేపల్లిలో విజయవాడ బయలుదేరిన బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

భట్టిప్రోలు మండలం నుంచి..

భట్టిప్రోలు: అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి శుక్రవారం భట్టిప్రోలు మండలంలోని 12 సచివాలయాల నుంచి ప్రత్యేక బస్సుల్లో, వాహనాల్లో తరలి వెళ్లారు. మండలంలోని పెదపులివర్రులో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, భట్టిప్రోలులో సర్పంచి దారా రవి కిరణ్మయి, అద్దేపల్లిలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి బస్సుల్లో తరలి వెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, దారా చెన్నయ్య, తిరువీధుల బాలాజీ, వేల్పూరి చిన్నారి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి పాల్గొన్నారు.

చుండూరులో..

చుండూరు మండలం వలివేరు నుంచి విజయవాడకు ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో మాజీ ఎంపీపీ గాదె శివరామకృష్ణారెడ్డి (బాబు) ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అమృతలూరి ప్రవీణ్, సర్పంచ్ పి.ఏసు, వైఎస్సార్ సీపీ నాయకులు చీడిపూడి సాంబిరెడ్డి పాల్గొన్నారు.



కర్లపాలెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కొల్లూరులో జెండా ఊపి బస్సుకు జెండా ఊపుతున్న ఎంపీడీఓ, వైఎస్సార్ సీపీ నాయకులు

వేమూరు మండలం నుంచి..

వేమూరు: అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ సభకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు. కార్యక్రమంలో కోగంటి లవకుమార్, దొప్పలపూడి జ్యోతిబాబు, గుమ్మడి దానియేలు, చిలకా సురేష్ పాల్గొన్నారు.

కొల్లూరు మండలం నుంచి.

కొల్లూరు: అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు అభిమానులు కోలాహలంగా శుక్రవారం తరలివెళ్లారు. ర్యాలీని ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచి మేకతోటి శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సూర్యదేవర రామకృష్ణ, నాయకులు ఆళ్లమూడి మధు, కూచిపూడి మోషే, కనపర్తి మోహన్‌రావు పాల్గొన్నారు.

సామాజిక కులగణన ప్రారంభం

రేపల్లె రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు కులగణన ఎంతో సహాయపడుతుందని మున్సిపల్ కమిషనర్ విజయసారథి చెప్పారు. పట్టణంలో శుక్రవారం ప్రారంభమైన సామాజిక కులగణన కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కులగణన కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తమ పరిధిలోని గృహాలను సందర్శించి ఓటరు వివరాలతో పాటు వారి కులాల వివరాలను నమోదు చేయటం జరుగుతుందని పేర్కొన్నారు.

పకడ్బందీగా కుల గణన

భట్టిప్రోలు: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను సంతృప్తి స్థాయిలో అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన కార్యక్రమం నిర్వహిస్తోందని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు తెలిపారు. శుక్రవారం భట్టిప్రోలు మండలం ఓలేరు సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లు నిర్వహిస్తున్న కులగణన సర్వేను ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, సర్పంచి మేరుగ రంగారావులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా హనుమంతరావు వివరాలు సరిగ్గా నమోదు చేయని సిబ్బంది, వలంటీర్లకు పలు సూచనలు ఇచ్చారు. వారం రోజుల పాటు సచివాలయ స్థాయిలో ఆన్‌లైన్ యాప్‌లో ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా మిగిలిపతే తర్వాత సచివాలయాల్లో సర్వే నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఇంకా ఎవరికైనా అందకుంటే ఈ కులగణన ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఎంపీటీసీ సభ్యురాలు నీలా సాంబమ్మ పాల్గొన్నారు.

కర్లపాలెం మండలంలో...

కర్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేను సక్రమంగా చేయాలని తహసీల్దార్ కేశవనారాయణరావు కోరారు. శుక్రవారం కర్లపాలెం సచివాలయం పరిధిలో జరుగుతున్న కుల గణన సర్వేను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో ప్రజల కుటుంబ వివరాలను నమోదు చేయాలని చెప్పారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో కుల గణన సర్వే జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సామాజిక కులగణన ప్రారంభం

కొల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనలో ప్రతి కుటుంబ వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని కొల్లూరు ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం ప్రారంభమైన కులగణన ప్రక్రియను ఆయన కొల్లూరులో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు సమన్వయంగా పనిచేస్తూ సమగ్ర కులగణనను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కొల్లూరు ఈఓ బి.మల్లికార్జున పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రికెట్ విజేత సూరేపల్లి

భట్టిప్రోలు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ పోటీలలో సూరేపల్లి టీమ్ విజయం సాధించింది. భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో వెల్లటూరు టీమ్‌పై సూరేపల్లి టీమ్ విజయం సాధించింది. సూరేపల్లి జట్టును గ్రామ సర్పంచి మోర్ల విజయలక్ష్మి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, పీఎసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి అభినందించారు.



విజయం సాధించిన సూరేపల్లి క్రికెట్ టీమ్

చేనేత రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలి

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.బాలాజి కోరారు. శుక్రవారం భట్టిప్రోలు రైలుపేట సొసైటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలాజీ మాట్లాడుడారు. శని, ఆదివారాల్లో మంగళగిరిలోని మార్కండేయ పద్మశాలీయ కల్యాణ మండపంలో మహా సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ మహా సభలలో చేనేత పరిశ్రమ, చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలను రూపొందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో చేనేత ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు కె.రామకోటేశ్వరరావు, ఎస్.జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు బాలాజీ

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భట్టిప్రోలు: మండలంలోని పెదపులివర్రు ఫీడర్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పి.ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. పెదపులివర్రు ఫీడర్ నుంచి తూర్పుపాలెం వరకు మాత్రమే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

సెబ్ సీఐ శ్రీనివాసులు

బాపట్లటౌన్: అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సెబ్ సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని వెదుళ్లపల్లి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న కోట చెన్నకేశవ రెడ్డిను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 10 మద్యం సీసాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా స్టువర్టుపురం 4వ గ్యాంగ్ సమీపంలోని కుందేరువాగు సమీపంలో నాటుసారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సెబ్ సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ అక్రమ మద్యం విక్రయించినా, నాటు సారా తయారు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైతుల శ్రేయస్సు, అభివృద్ధే లక్ష్యం

పెదనందిపాడు: రైతుల శ్రేయస్సు, అభివృద్ధికి గానూ పలు కార్యక్రమాలు నిర్వహించి సాగులో చేదోడువాదోడుగా ఉంటున్నట్లు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ శ్రీలత తెలిపారు. మండల పరిధిలోని పాలపర్రు గ్రామ సచివాలయంలో శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీలత మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రైతు భరోసా కేంద్రాలు, పంటల కొనుగోలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు పలు గ్రామాలకు పంపించి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. చదువుకున్న విషయాలు, ఫీల్డ్‌లో జరిగే విషయాల గురించి పూర్తిగా అవగాహనకు వస్తున్నారని చెప్పారు. ప్రత్యక్షంగా రైతులు సాగులో పాటిస్తున్న పద్ధతులు గురించి పూర్తిగా తెలుసుకోవటానికి ఈ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏ. సునీత, ఉప సర్పంచ్ జంపని సంజీవరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు హసీనాభాను, వై.బిందియా పాల్గొన్నారు.

రేపు సురభి ఆధ్వర్యంలో 'మాయాబజార్' ప్రదర్శన

తెనాలి: ప్రముఖ పౌరాణిక నాటక సంస్థ సురభి సమాజంచే ఆదివారం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో 'మాయాబజార్' నాటకాన్ని ప్రదర్శించనున్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం, ప్రఖ్య చిల్డ్రన్ ఆర్ట్స్ థియేటర్ సంయుక్త నిర్వహణలో జరిగే ప్రదర్శన వివరాలను శ్రీసాయి సంతోషి నాట్య మండలి ఆర్గనైజర్ సురభి సంతోష్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రదర్శనకు ముందు కూచిపూడి, జానపద నృత్యప్రదర్శనలు ఉంటాయని నిర్వాహక సంస్థల బాధ్యులు తెలిపారు. భారీ సెట్టింగులు, సాంకేతిక నైపుణ్యంతో అనుభవజ్ఞులైన కళాకారులచే ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఆయా సంస్థల నాయకులు గరికపాటి సుబ్బారావు, ఆరాధ్యుల కన్నా, అయినాల మల్లేశ్వరరావు, లక్కరాజు లక్ష్మణరావు, లక్ష్మణశాస్త్రి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు

ఓలేరు(భట్టిప్రోలు): గ్రామీణ ప్రాంతంలోని మారుమూల గ్రామాలకు వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఎంతగానో రోగులకు దోహదపడుతుందని ఎంపీపీ లలిత కుమారి పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం ఓలేరు సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. శిబిరంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు, వైద్యులు సీహెచ్ రామలక్ష్మి, స్పెషలిస్ట్ డాక్టర్లు, ఆప్తమాలజిస్ట్ అరుణరాణి పాల్గొని సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచి మేరుగ రంగారావు, ఎంపీటీసీ సభ్యురాలు నీలా సాంబమ్మ, తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, పంచాయతీ కార్యదర్శి ఎ. శ్రీదేవి, పార్టీ నాయకులు డి.నాగమల్లేశ్వరరావు, ఎం.నాగబాబు పాల్గొన్నారు.

కొల్లూరులో.

కొల్లూరు: ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం పాటుపడుతోందని కొల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుష్మ అన్నారు. శుక్రవారం మండలంలోని చినపులివర్రులో ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజల చెంతకే మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన తరుణంలో ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. శిబిరంలో 305 మంది రోగులకు పలు రకాల వైద్య సేవలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. వైద్యులు ఎస్.సాంబశివరావు, సాయి మాధవరెడ్డి, కావ్యతేజ రోగులకు వైద్య సేవలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దానయ్య, సచివాలయ కన్వీనర్‌లు కనపర్తి మోహన్‌రావు, మాతంగి రత్నకుమార్, దున్న వెంకయ్య పాల్గొన్నారు.



ఓలేరులో కిట్లు అందజేస్తున్న ఎంపీపీ లలిత కుమారి, మండల ప్రత్యేక అధికారి హనుమంతరావు

జాతీయ స్కాలర్ షిప్‌కు విద్యార్థుల ఎంపిక



వీరాస్వామి భాను తేజ రాజీవ్ సురయు నందుబాబు

అమృతలూరు(వేమూరు): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జాతీయ స్కాలర్ షిప్‌కు ఐదుగురు విద్యార్థులు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల నుంచి 20 మంది పరీక్షకు హాజరు అయినట్లు చెప్పారు. 8వ తరగతి విద్యార్థులు దేవరకొండ వీరాస్వామి, జి.భానుతేజ, జి.నందుబాబు, ఎ.రాజీవ్, ఎం.సురయు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిది తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఏడాదికి రూ.12, 000 అందజేయనున్నట్లు చెప్పారు. మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికై న విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు వేంపల్లి షరీఫ్ కథలపై చర్చ

తెనాలి: ఊరు పేరునే ఇంటిపేరుగా చేసుకున్న రచయిత వేంపల్లి షరీఫ్ కథాసంపుటాలు జుమ్మా, టోపి జబ్బార్ పుస్తకాలపై శనివారం తెనాలిలో చర్చా వేదిక నిర్వహించనున్నారు. ముస్లింల అస్తిత్వ వేదనను ఆవిష్కరిస్తూనే మానవతా స్ఫూర్తిని రగిలించే, ఆయా సంపుటాల్లోని కథలకు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించాయి. ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో స్థానిక సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు నెల నెలా నిర్వహిస్తున్న మంచి పుస్తకంపై చర్చావేదికలో భాగంగా స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటయే సభకు జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. సాహిత్య విమర్శకుడు సుంకర గోపాల్, సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి సత్యరంజన్ చర్చలో పాల్గొంటారు.

నీటి నిల్వలను అరికట్టండి



తెనాలిఅర్బన్: నీటి నిల్వల వలన అనేక అనర్థాలున్నాయని, దానిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని మలేరియా సబ్ యూనిట్ తెనాలి అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావులు పేర్కొన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని నాజరుపేట, చంద్రబాబు నాయుడు కాలనీలలో శుక్రవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నీటి నిల్వల వల్ల దోమల వ్యాప్తి పెరిగి అనేక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు డ్రైడేగా శుక్రవారంను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, బంగారు నాగమల్లేశ్వరరావు, దాసరి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

